# భారతదేశము సత్య, ధర్మములకు ఆలవాలమైనది

వేదాంత గ్రంథముల్ వెలయంగ తాచదివి
నేర్పు మాటలందు నిపుణుడైన
సద్గుణంబులు మదిని చక్కగా లేకున్న
వాడు నరుడు అగునె వాస్తవముగ

**దివ్యాత్మస్వరూపులారా!**

ప్రాచీనకాలమునుండి భారతదేశము అనేక దేశములకు ఆధ్యాత్మిక తత్త్వమును ప్రబోధిస్తూ వస్తున్నది. 'లోకాసమస్తాస్సుఖినో భవంతు' అన్నదే హైందవ సాంప్రదాయముయొక్క లక్ష్యము. ఆధ్యాత్మికమనగా వంటరితనమనిగాని, ఏకాకి జీవితమనిగాని భావించరాదు. యావత్ మానవకోటిని ఏకాత్మగా విశ్వసించి గుర్తించటమే ఆధ్యాత్మికముయొక్క తత్త్వము.

**అంత్యకాలమునందు సంసారము మనవెంట రాదు, సంస్కారమే మనవెంట వచ్చేది**

భారతదేశము సత్యధర్మములకు ఆలవాలమైనది. 'సత్యంవద', 'ధర్మంచర' అనే మహావాక్యములను జగత్తునకు వ్యాపింపజేసి, ఆచరింపచేసి, ఆనందించి, పదిమందికి పంచినది భారతదేశము. ఇట్టి పవిత్రమైన భారతీయ సంస్కృతిని ఈనాడు మానవుడు విస్మరించి లౌకికమైన, భౌతికమైన జీవితమును ఆశించి అనేకవిధములైన అశాంతికి గురౌతున్నాడు. సత్యధర్మములు లేని మానవునియొక్క నేత్రములు గ్రుడ్డివారి నేత్రములతో సమానము. భారతీయులు తెల్లవారిమొదలు రాత్రి పరుండునంతవరకుకూడను ఈ పవిత్రమైన భారతీయ సాంప్రదాయములను, వేదప్రమాణములను తెలిసియో తెలియకో అనుసరిస్తూ, ఆచరిస్తూ, అనుభవిస్తూ వస్తున్నారు. ఇలాంటి సంస్కృతిని కలిగిన భారతీయులు ఈనాడు సంస్కారమునకు దూరమై సంసారమునకు సమీపమవుతున్నారు.

మానవుడు బ్రహ్మనుండి వచ్చినవాడుగాని, ప్రకృతినుండి వచ్చినవాడు కాదు. ఎంతకాలము జీవించినప్పటికిని మనవెంట సంసారము రాదు. సంస్కారమే మన వెంట వచ్చేది.

sri sathyasai vachanamrutam

**ఏమి తాగొనివచ్చె, ఏమి తాగొనిపోయె**
**పుట్టునప్పుడు మరి గిట్టునపుడు**
**ధనము నెచ్చటికేగు తానేగునెచ్చటికి**
**వినుడు భారతీయ వీరసుతుడ**

కేవలము లౌకికమైన, భౌతికమైన జీవితమే ప్రమాణము, ప్రధానముగా భావించి, పవిత్రమైన, నిత్యమైన, సత్యమైన మానవత్వాన్ని వ్యర్థము గావించుకోటం యిది నిరర్థకమైన జీవితమే!

చిన్న ఉదాహరణము; భారతదేశమునందు తల్లి, తండ్రి, గురువు, దైవము అను మాటలు వరుసగా ప్రతివారినోటను మనము వింటూనే వుంటాము. ఈ క్రమమునకు అంతరార్థము యేమిటి? మానవుడు పుట్టిన తక్షణమే కంటికి కనిపించునది తల్లి. పాలిచ్చి పోషించి, లాలించి పాలించునది తల్లి. అట్టి తల్లియే మొట్టమొదటి దైవము. ఆ తల్లితప్ప అన్యులు తండ్రిని చూపలేరు. కనుకనే తమ అభివృద్ధిని ఆశించి వున్నతస్థాయికి గొనిపోయే తండ్రిని చూపించునది తల్లి. తన కుమారుని కీర్తి, గౌరవములను జగత్వ్యాప్తి గావింపచేసుకొనుటకై అనేక రకములుగా ఆశలను పెంచుకొని చక్కని గురువును చూపించుతాడు తండ్రి. గురువు అంతర్ బహిర్తత్త్వములను బోధించి, లౌకిక వైజ్ఞానికములను ఆచరింపచేసి అనేక విధముల వున్నతస్థాయికి గొనివచ్చిన తదుపరి, భగవంతుని చూపుతాడు. తల్లి తండ్రిని చూపటం, తండ్రి గురువును చూపటము, గురువు దైవమును చూపటము ఈ విధమైన క్రమాన్ని అనుభవించుతూ వచ్చింది ప్రాచీన కాలమునుండి భారతదేశము. కనుక, తల్లి తండ్రి, గురువు, దైవము అనే క్రమపద్ధతి అనుసరిస్తూ వచ్చింది.

## భారతదేశము ముక్తి మార్గమును బోధిస్తుంది

అదేవిధముగా భక్తి, జ్ఞాన, వైరాగ్యతత్త్వము. ఈ యొక్క తత్త్వముచేతనే మనకు ముక్తి ప్రాప్తిస్తుందని వేద ప్రమాణము. భక్తి, జ్ఞానమును ప్రబోధిస్తుంది. జ్ఞానము, వైరాగ్యమును చేకూరుస్తుంది. ఈ వైరాగ్యము, తత్త్వజ్ఞానమును గుర్తింపచేస్తుంది. భక్తి, జ్ఞాన, వైరాగ్య, తత్త్వమనే ఈ నాలుగు స్థంభములే ముక్తి భవనమునకు సరైన స్తంభములు ఈ నాలుగు సోపానములచేతనే ముక్తి స్థానమును మానవుడు పొందగల్గుచున్నాడు. దీనికి చక్కని ఆదర్శము భాగవతము. ఈ

sri sathyasaivacahamrutam

భాగవతమందు ఐదు అక్షరములు వుంటున్నాయి. భా-గ-వ-త-ము. ఈ "భకారమనే సంకేతము చేతనే" గకారమనే సంకేతము బోధింపచేస్తుంది. ఈ "గకారమనే జ్ఞానము" వకారమనే వైరాగ్యమును చేర్చగలుగుతున్నది. ఈ 'వకారమనే వైరాగ్యము 'త' కారమనే తత్త్వములో ప్రవేశింప జేస్తుంది. ఈ తత్త్వజ్ఞానమే ముక్తిలో ప్రవేశిస్తుండాది. కనుకనే, భకారమనే భక్తి "గకారమనే జ్ఞానముద్వారా, "వకారమనే వైరాగ్యములో ప్రవేశించి" "తకారమనే తత్త్వాన్ని ప్రబోధచేసి" మకారమనే ముక్తిలో ప్రవేశిస్తున్నాది. కనుకనే భాగవతమనేది ముక్తికి మార్గములైన సోపానములని మనము గుర్తించవలసి వస్తుంది.

**ఎచ్చటనుండి వచ్చామో అచ్చటికి పోవటంకోసం మనం ప్రయత్నం చేయాలి**

ఈ భాగవతమునందు ప్రహ్లాద చరిత్ర అతి ప్రధానమైనది. ఈ ప్రహ్లాదుడు విద్యార్థిగా వుండే సమయములో తన తోటి విద్యార్థులతో

**దేన శుభము లేదు దివ్యకీర్తియు లేదు**
**జగతి పుట్టి పుట్టి చచ్చి చచ్చి**
**పొరలనేల మనకు పుట్టని చావని**
**త్రోవ వెదకికొనుట దొడ్డబుద్ధి**

అన్నాడు. 'త్రోవ వెదకికొనుట దొడ్డబుద్ధి' అన్నాడు. ఏ త్రోవను వెతకాలి? అదియే, మనము వచ్చిన త్రోవను వెతకాలి. మనము వచ్చిన త్రోవను మరచిపోయిన దౌర్భాగ్యులమైనామిప్పుడు. ఎక్కడనుండి వచ్చాము? ఎక్కడికి పోవటానికి వెతుకుతున్నాము? ఇదే మానవత్వములో వున్న అంధత్వము. దీనినే భాగవతములో 'ఎచ్చట పుట్టె నచ్చట కేగుట నైజము ప్రాణికోటికిన్' అని వర్ణించడం జరిగింది. ఎక్కడనుండి పుట్టెనో అక్కడికి పోవటం మన లక్ష్యము. మనము బ్రహ్మనుండి వచ్చినవారము. ఆత్మనుండి వచ్చినవారము. అందువలన, ఆత్మవైపు మనము ప్రయాణము సల్పాలి. కనుకనే 'మమైవాంశో జీవలోకే జీవభూత స్సనాతనః' అన్నాడు, కృష్ణుడు భగవద్గీతలో. అనగా 'ఈ ప్రపంచమనేది, ఈ మానవుడు నా అంశమేగాని, ప్రకృతి అంశముగాని, పంచభూతముల అంశముగాని యింకే అంశముగాని కాదు. నా యొక్క అంశమే!' అని చక్కగా వుద్ఘాటించాడు. కనుకనే మనము ఎచ్చటనుండి వచ్చితిమో అచ్చటికి



sri sathyasai vachanamrutam

పోవటంకోసం ప్రయత్నం చేయాలి. అదే దొడ్డబుద్ధి. కానీ, ఆ స్థానమును మనము మరచిపోయి ఈ ప్రకృతిలోపల సౌఖ్యసంతోషములతో మునిగి కేవలము మత్తుడై వున్మత్తుడై జీవించటము గొడ్డు బుద్ధి. దీనినే పురందరదాసు చెప్పాడు, "ఓ భగవంతుడా! చిన్మయమూర్తియైన నిన్ను మరచటంచేతనే నేను ఈ మృణ్మయ దేహాన్ని ధరించవలసి వచ్చింది. ఈ ప్రకృతి మృణ్మయమైనది. ఇక్కడకు రావటానికి కారణము యేమిటి? నిన్ను మరచటము చేతనే!" అని. కనుక, మనము ఈనాడు జగత్తునందు ఈ విధమైన జీవితాన్ని గడపటానికి కారణం యేమిటి? దైవమును మర్చటమే!

### భగవంతుడు హృదయనివాసి

మనము అనుభవించే సుఖసంతోషములన్నీ క్షణభంగురమైనవి. శంకరాచార్యుడుకూడను చెప్పాడు. 'మాకురు ధన జన యవ్వనగర్వం హరతి నిమేషాత్ కాలస్సర్వం'. ఈ యవ్వనము, ధనము, జనము వీటియొక్క బల గర్వములంతా క్షణ భంగురములు. జీవితము వుండగనే దివ్యత్వమనే ఆత్మతత్త్వము అనుభవించటమే నిజమైన మానవుని కర్తవ్యము. భగవంతుడు యెక్కడో ఏ వైకుంఠమునందో, ఏ కాలమునందో వున్నాడు అనే వ్యామోహమును కొంతవరకు మనము మానాలి. ఈ వైకుంఠము, స్వర్గము, కైలాసము యివన్నీ కేరాఫ్ ఎడ్రస్సులు. ఇటువంటి ప్రార్థనలు భగవంతుని చేరితే చేరవచ్చునుగాని, ఆలస్యముగా పోవచ్చును. భగవంతుని కరెక్ట్ ఎడ్రస్ మనం గుర్తించుకోటానికి ప్రయత్నించాలి. 'ఈశ్వర స్సర్వ భూతానాం'! హృదయవాసి భగవంతుడు. కరెక్ట్ ఎడ్రస్ తీసుకుంటే అతి త్వరగా మన ప్రార్థన అతనికి చేరిపోతుంది. కనుకనే భగవద్గీతయందు 'మమైవాంశో జీవలోకే' అని చెప్పి తదుపరి 18వ అధ్యాయము లోపల 61వ శ్లోకములో తనయొక్క స్వరూపాన్ని అందిస్తూ వచ్చాడు.

**ఈశ్వర స్సర్వభూతానాం హృద్దేశేర్జున తిష్ఠతి**
**భ్రామయన్ సర్వభూతాని యన్త్రారూఢాని మాయయా**

భగవంతుడు సర్వజీవుల హృదయమునందు నివాసము చేస్తున్నాడు. 'త్వమేవ శరణం గచ్ఛ' అన్నాడు 62వ శ్లోకంలో "హే! అర్జునా నీవు నాకు శరణాగతి పొందనక్కరలేదు. నీకు నీవు శరణు జొచ్చుకో!" అన్నాడు. సర్వభూతములయందు వుండిన భగవంతుడు నీయందు మాత్రము

sri sathyasai vachanamrutam

లేదా, కనుక నీ హృదయేశుడే నీ భగవంతుడు! నీవే భగవంతుడు! కేవలము దేహధారియై వుండటంచేత మాయనుగప్పి, మర్మమును తెలుసుకొనక, ధర్మమును ఆచరించక కర్మను నీవు అనుభవిస్తున్నావు. ఈ జన్మ రావటానికి కారణం యేమిటి? మన కర్మలే దీనికి మూలకారణము. ఈ కర్మలు దేనిని ఆధారము చేసుకుని ఆచరించాలి? ధర్మాన్ని ఆధారం చేసుకుని ఆచరించాలి. ఈ ధర్మము ఎక్కడకు గొనిపోతుంది? బ్రహ్మను చేరుస్తుంది. కనుక మానవజీవితమనే భవనమునకు కర్మ, జన్మ, ధర్మ, బ్రహ్మ అనే నాలుగు సోపానములు. కర్మచేతనే ధర్మము లభిస్తుంది. ఈ కర్మ, ధర్మనిమిత్తమే ఆచరించాలి. ఈ ధర్మమే బ్రహ్మను చేరుస్తుంది. భగవంతుడు ధర్మ స్వరూపుడు, సత్యస్వరూపుడు.

**మానవుడు ఏడు విధములైన పాశములచే బంధింపబడ్డాడు**

ఇట్టి సత్యధర్మములతో కూడిన భారతదేశము ప్రపంచమునకు హృదయము వంటిది. ప్రపంచమునకే హృదయస్థాయి అయిన భారతదేశము మన హృదయమునకు మాత్రము హృదయస్థాయి కాదా! ఈనాటి మానవుడు యింత అజ్ఞానములో వుండటానికి కారణం ఏమిటి? మానవుడు ఏడు విధములైన పాశములచే కట్టబడ్డాడు. దేహము ఒక బంధన. కర్మ రెండవ బంధన, రాగము మూడవ బంధన, ద్వేషము నాలుగవ బంధన, అహంకారము ఐదవ బంధన, అవివేకము ఆరవ బంధన, అజ్ఞానము ఏడవ బంధన. ఈ అజ్ఞానము అవివేకమునందే పుడుతున్నాది. ఈ అవివేకము అహంకారమునుంచి ఆవిర్భవిస్తున్నది. ఈ అహంకారము రాగముచేత బయలుదేరుతున్నది. ఈ రాగమునుండి ద్వేషము ప్రారంభమవుతుంది. ఈ అన్నింటిచేత కర్మ నాచరిస్తున్నారు. ఈ కర్మలద్వారా దేహమనే జన్మను మనం ఎత్తుతున్నాము. కనుక, దేహముచేత సత్కర్మలు ఆచరించి రాగద్వేషాలను త్రుంచి అహంకారము నిర్మూలము గావించి ఈ అజ్ఞాన, మమకారములను దూరము చేసినప్పుడే ఆత్మస్వరూపుడుగా నీవు వెలుగుతావు. భగవంతునితో ఏకత్వము వహించటము, అనుభవించటము, ఆనందించటమే నిజమైన మానవుని కర్తవ్యము. సముద్రమున్నది. ఈ సముద్రము లోపల తడి, చల్లదనము, తెల్లదనము మూడు గుణములుంటున్నాయి. ఈ సముద్రమునుండి వెలువడిన అలలయందుకూడను ఈ గుణములే వుంటున్నాయి. కనుక బ్రహ్మస్వరూపుడే భగవంతుడనే సముద్రము. ఈ సముద్రము నందున్న

అలలు ఈ జగత్తులోని జీవులు. సముద్రమునందుండే తడి, చల్లదనము, తెల్లతనము ఈ మూడు జీవునియందుకూడను వుంటున్నవి. ఈ అలలయందు కూడను వుంటున్నాయి. రూపనామములు వ్యత్యాసం. కానీ గుణసంపర్కమైన ఆత్మతత్త్వమొక్కటే! కనుక, అందరియందు వుండేది ఆత్మతత్త్వమనే సత్యాన్ని మనము గుర్తించి వర్తించటమే నిజమైన ఆధ్యాత్మికము. ఇలాంటి ఆధ్యాత్మిక తత్త్వాన్ని మన మాచరించి, ఆనందించి, పెంచి, పదిమందికీ పంచటమే మనయొక్క సేవాతత్త్వము.

**సేవ అనేది ఇచ్చుకోవటమేగాని పుచ్చుకోవటము కాదు**

సేవ, సేవ, సేవ! అయితే ఈ సేవను యేరీతిగా మనము చేయాలి? ప్రాకృతమైన దృష్టితో మనము సేవ చేస్తే యిది బంధకారణము అవుతుంది. ఏ విధమైన ఫలితమును ఆశించకుండా చేయాలి. సేవ అనేది యిచ్చుకోటమేగాని పుచ్చుకోటం కాదు. కానీ యినాటి సేవ యిచ్చుకోటం, పుచ్చుకోటంగా ఉంటున్నది. పుచ్చుకోటం 'ఏ సేవ చేస్తే ఏ ఫలితము నాకు లభిస్తుంది? ఏ సేవలో పాల్గొంటే ఏ కీర్తి నాకు లభిస్తుంది'? ఇలా సాగుతున్నాయి మన ఆలోచనలు. ఈ పేరు ప్రతిష్టల కోసము, కీర్తిమర్యాదలకోసము మనము సేవలో యేమాత్రము పాల్గొనరాదు. 'నా ప్రియమైన భగవంతునికే నేను సేవ చేస్తున్నాను,' అనే ఏకాత్మ భావముతో మనం సేవ చెయ్యాలి. ఇది కేవలము ఆత్మతృప్తికై తను ఆచరించినట్టుగా భావించాలి. 'నేను ఎవరికో సేవ చేస్తున్నాను, నేను సేవ చేసేవాడిని, చేయించుకునేవాడు ఆ వ్యక్తి' అనే అహంకారమునకు అవకాశము యివ్వరాదు. ఏ సేవలు చేసినప్పటికి ప్రేమభావముతో చెయ్యాలి. ఇదే నిజమైన ఆధ్యాత్మికము. ఈ విధమైన కర్మలలో మనం ప్రవేశించాలి. Work is worship, duty is God. ఇదే మన నిజమైన కర్తవ్యము. ఈనాడు మన కర్తవ్యమును విస్మరించి పోతున్నాము. కర్మయొక్క ఫలితాన్ని ఆశిస్తున్నాము. తద్వారా మనము బంధితులమవుతున్నాము. అశాంతికి గురౌతున్నాము.

**సేవకుడు కాక నాయకుడు కావటానికి వీలులేదు**

ప్రేమస్వరూపులారా! ఆధ్యాత్మిక తత్త్వమంటే కేవలము దేవాలయములకు పోవటము, యాత్రలు చేయటము, దైవమును పూజించటము, దైవ చింతన చేయటము యిత్యాది మాత్రమే

sri sathyasai vachanamrutam

కాదు. ఇవి కేవలము సత్కర్మలు. ఇవి ఆచరించతగ్గవేగానీ చిత్తశుద్ధితో మనము సేవలు చేయాలి. నిజముగా ఈ సేవ దైవసేవగా భావించాలి. ఈనాడు ఎక్కడ చూచినా నాయకులుగా కనిపిస్తున్నారుగాని సేవకులుగా ఎక్కడా కనిపించటము లేదు. ఈనాడు భారతదేశము సేవకత్వమును కోల్పోయింది. నాయకత్వమునకు అఱ్ఱులు చాస్తున్నాది. సేవకుడు కాక నాయకుడు కావటానికి వీలులేదు. సేవకుడు కాని నాయకుడే ఈనాడు జగత్తుకు యింత అపకారము చేస్తుండేది. సేవకులు కావాలి ముందు. సేవలయందే గౌరవము, ప్రతిష్ట, ఆహ్లాదము కలుగుతుంది. కనుక దైవబిడ్డయైన ప్రతి వ్యక్తి చేతనైనంత సేవ చేయటానికి ప్రయత్నించాలి. ఇలాంటి పవిత్రమైన భావములచేత మానవత్వమును సార్థకము చేసుకోటానికి ప్రయత్నించాలి. భజన చేస్తున్నాము. పూజలు చేస్తున్నాము. ధ్యానము చేస్తున్నాము. జపములు చేస్తున్నాము. ఇవన్నీ సత్కర్మలే! ఈ కర్మలయొక్క ఫలితము ఏమిటి? కేవలము తనలోప్రవేశించిన, తనను ఆవరించిన మాలిన్యమును దూరము చేసుకోటంకోసమే! ఈ కర్మలవల్ల మాలిన్యము దూరమవుతుందేగాని దైవానుగ్రహము యేమాత్రము లభించదు. సత్కర్మలన్నియు మన మాలిన్యములు దూరము చేయటానికే!

**ప్రకృతి సంబంధమైన భావములు దూరము చేస్తే ఆత్మసాక్షాత్కారము కలుగుతుంది.**

తదుపరి దైవానుగ్రహమునకు పాటుపడాలి. దైవము తనయందే వుంటున్నాడు. దైవము ప్రత్యేకముగా లేదు. దైవమును మరచటంచేతనే మానవుని గుర్తించటానికి ప్రయత్నిస్తున్నాము. ఒక చక్కని ఉదాహరణము. నిప్పు వుంటుండాది. ఆ నిప్పును మనము అలక్ష్యము చేయటమువలన ఆ నిప్పునుండి నిమురు వచ్చి నిప్పును కప్పివేస్తుంది. నిమురు అనగా బూడిద. అది నిప్పును మూసివేసింది. కనుక, మనకు నిప్పు కనిపించటం లేదు. నిప్పు ఎక్కడ వుంది? దాని లోపలనే వుంది. ఆ నివురును మనము వూదివేస్తే నిప్పు కనిపిస్తుంది. అదేరీతిగానే దైవత్వమనేది మనలో వుంది. మనము కేవలము అలక్ష్యము చేయటంవలన, దైవచింతన చేయకుండా పోవటంచేత అక్కడ 'మాయ' అనే ప్రకృతి, 'వాంఛ' అనే నివురు దైవమును కప్పివేస్తాయి. ఆ మాయ ఎక్కడ నుండి వచ్చింది? అగ్నినుంచే వచ్చింది. ప్రత్యేకముగా యెక్కడనుండో రాలేదు. అగ్నినుంచే వచ్చి అగ్నిని కప్పివేసింది. మనము సత్కర్మలద్వారా,

sri sathyasai vahanamrutam

సేవలద్వారా తగిన ప్రయత్నము చేసి కర్తవ్యమును నిర్వర్తిస్తే ఆయొక్క ధూళి పోతుంది. ఎప్పుడు ఆ నివురు పోయెనో నిప్పు సహజంగానే కనిపిస్తుంది. నీవు ఆత్మస్వరూపుడే అయినావు. నీనుంచి వచ్చిన భ్రాంతియే నిన్ను కప్పివేస్తుంది. దివ్యత్వము యెక్కడో వున్నదని తపించి వెతుకుతున్నాము. ఈ ప్రకృతి సంబంధమైన భావములు కొంచెము దూరము చేస్తే, నీకు నీవుగానే కనిపిస్తావు. నీకు నీవు సాక్షాత్కరిస్తావు.

**'దిల్‌మే రామ్! హాత్‌మే కామ్!'**

ప్రేమస్వరూపులారా! మీరు కాలమును వ్యర్థము చేయటానికి ప్రయత్నించకండి. భజించుచూ సేవలు చేయాలి. హృదయములో దైవత్వమును విశ్వసించండి. చేతితో సత్కర్మలు ఆచరించండి. దీనినే 'దిల్‌మే రామ్, హాత్ మే కామ్' అన్నారు. హృదయములో దైవత్వమును విశ్వసించక చేతులతో ఎంతగొప్ప పనులు చేసినప్పటికి యివి కేవలము వ్యర్థమైన పనులే. సారము కలిగిన పనిగా మనము ప్రయత్నించాలి. ఎవరినీ మనము దూషించకూడదు.

**పరుల దూషణ చేయ పాపఫలంబబ్బు**
**విడువదెన్నటికిని విశ్వమందు**
**పరులు పరులు కారు పరమాత్ముడగునయా**
**మరువబోకుడిట్టి మంచిమాట**

పరులు, పరులు కారు పరమాత్ముడే! ఇలాంటి విశాలమైన భావము, పవిత్రమైన హృదయము, దివ్యమైన భావము, ప్రేమ మనము పెంచుకొనుటకే ఈ సాధనలంతా అవసరము. ప్రపంచము మెచ్చేకోసము కాదు. ఎవరో నిన్ను మెచ్చుకోనక్కర లేదు. భగవంతుడు మెచ్చుకుంటే చాలు. అదే discrimination. నీకు నీవు చక్కగా విచారణ చెయ్యాలి. 'నేను చెప్పినట్టుగా ఆచరిస్తున్నానా లేదా', అనేది మొట్టమొదట చూడాలి. 'నేను యేమి చెప్తుతున్నానో, ఏమి తలుస్తున్నానో, ఏది చూస్తున్నానో దానిని నేను ఆచరిస్తున్నానా'? కనుకనే thought, word, deed ఈ మూడింటి ఏకత్వమును మనము నిరూపించాలి. ఇదే నిజమైన మానవత్వపు విలువ. ఈ విలువను కోల్పోయినాము మనము, నేడు. మెదడులో తలంచేది ఒకటి, హృదయములో యోచన చేసేది మరొకటి, చేతులతో కర్మనాచరించేది మరొకటి. Education in Human Values



sri sathyasai vachanamrutam

అని పెట్టారు. కాదు, కాదు. Three H.V.అనగా ఒక H, head. ఒక H, heart. ఒక H, hand. ఈ మూడింటిని కలిపినప్పుడు 3 H.V. అవుతుంది. నిజముగా మీకు ఎంతశక్తియో, ఎంతమీరు చేయగలరో అంతవరకే మీరీ సేవలలో పాల్గొనండి. అధికముగా పోనక్కరలేదు. భగవంతుడు, సేవ ఎంతసేపు చేశావని చూడడు. ఏ హృదయముతో చేశావని యోచిస్తాడు. భగవంతుడు ఎప్పుడూ కూడను quality కోరతాడు గాని quantity కోరడు. ఒక tea spoon of cow milk usefulగా వుంటుంది. Why barrels of donkey's milk? కనుక ఆడంబరమైనదానితో, అహంకారపరమైనదానితో, ప్రేమరహితమైన హృదయముతో మనము ఎన్ని సేవలు చేసినా ప్రయోజనము లేదు. సేవయే భగవంతుని దగ్గరకు తీసుకుపోయేది, సేవయే భగవంతుని సాక్షాత్కరింపచేసేది, సేవయే నిన్ను నీవు గుర్తించుకోటానికి సహాయము చేసేది.

**నిన్ను నీవు తెలుసుకుంటే దేవుని తెలుసుకున్నట్లే!**

దేవుడెక్కడ, దేవుడెక్కడ అని ప్రాకులాడటానికి ప్రయత్నించనక్కరలేదు. నిన్ను నీవు తెలుసుకుంటే దేవుని తెలుసుకున్నట్టే! నిన్ను నీవు తెలుసుకొనకుండా దేవుడెక్కడ నీకు కనిపిస్తాడు? కనుక, దేవుని తెలుసుకోటానికి ప్రయత్నించేవారు మొట్టమొదట తమను తాము తెలుసుకోవాలి. Who am I? నేనెవరు? ఈ తత్త్వాన్నే ప్రాచీన మహర్షులందరు విచారణ సలుపుతూ వచ్చారు. ఒకనాడు వృద్ధుడైన సోక్రటీసు ఒక బీచ్ లోపల walking చేస్తున్నాడు. తన తత్త్వాన్ని తాను విచారించుకుంటూ 'నేనెవరు, నేనెవరు'? అనుకుంటూ పోతున్నాడు. అతడు మహాతత్త్వజ్ఞాని. ఇంకొక రిటైర్డు వ్యక్తి అదే బీచ్‌లోపల walk చేసుకుంటూ వస్తున్నాడు. అతను యేదో యోచన చేసుకుంటూ వస్తున్నాడు. ఈ సోక్రటీసు కూడను యోచన చేసుకుంటూ వస్తున్నాడు. ఒకరిని ఒకరు చూచుకోలేదు. వచ్చి ఒక్కతూరి యిద్దరు ఒకరినొకరు కొట్టుకున్నారు. ఆ ఎదుటి వ్యక్తి who are you అన్నాడు. 'అదే నేను తెలుసుకోవాలని కోరుతున్నాను, నేనెవరో చెప్పండి', అన్నాడు. మహనీయులయొక్క తలంపులు ఈ విధముగా వుంటాయి. మనము 'నేను ఎవరు', అంటే so and so అంటూ యింకా డిగ్రీలు పెట్టుకుంటూ పోతుంటాము. ఈ డిగ్రీలతో మనకు యేమాత్రము ప్రయోజనము లేదు. ఏదో కొన్ని కొన్ని బిరుదులంతా తీసుకొని వాటిని

srisathyasaivachanamrutam

ఒక డిగ్రీలుగా పెట్టుకుంటాము. కొన్ని డిప్లమోలు తీసుకుని దాన్నికూడ డిగ్రీలుగా పెట్టుకుంటాము. దీనివలన ఏదో పదవులు లభిస్తాయని మనము భ్రాంతి పడుతున్నాము. కాని, నిజమైన డిగ్రీ నీ చిత్తశుద్ధియే! అది పవిత్రమైనది. ఒక చిన్న కథ. ఒక వ్యక్తి ఉద్యోగనిమిత్తమై అనేక ప్రయత్నములు చేశాడు. అతను పెద్దకుటుంబీకుడు, కాని పేదవాడు. అలాంటి పరిస్థితిలో బిడ్డలను, భార్యను పోషించవలసి వచ్చింది. తన కర్తవ్యాన్ని తాను నిర్వర్తించవలసివచ్చింది. అలాంటి సమయములో తనకు ఎక్కడా ఉద్యోగము లభించలేదు. ఏదో అంతో యింతో వున్న డబ్బును తీసుకొని ఒక చిన్న బోర్డు లోపల తన పేరు వ్రాయించి కొన్ని డిగ్రీలు వ్రాసి పెట్టాడు యింటి ముందు. ఆ బోర్డుపైన తనపేరు వ్రాసాడు. దానికి ప్రక్క F.F.S, F.T.D అని వ్రాయించాడు. ఆ మార్గములోపల చాలామంది students అంతా వెడుతున్నారు. ఏమిటి ఈ డిగ్రీలు ఇంజనీరింగా, డాక్టరా, యింకేవిధమైన డిప్లమోనా, అని యోచిస్తూ వచ్చారు. ఒక్కొక్కరు ఒక్కొక్క విధముగా అర్థము చెప్పుకుంటువచ్చారు. ఒక విద్యార్థి ధైర్యము చేసి లోపలకు వెళ్లి 'ఈ డిగ్రీలన్ని వుంటున్నాయి, వీటి అర్థమేమిటి'? అన్నాడు. అప్పుడు చెప్పాడు, ఆవ్యక్తి F.F.S Father of five sons: F.T.D. Father of Ten Daughters అని. మన బిరుదులు, ఇవా? ఇదా మనము ఈనాడు సంపాదించవలసినది?.

### అన్నింటికిని దైవమే ఆధారము

ఈ బంధనలనా మనము ఆశించవలసినది? ఈ బంధనలంతా మనకు దుఃఖ హేతువేకాని, మరొకటి కాదు. 'పరవశం దుఃఖం ఆత్మవశం సుఖమ్' నీవు ఆత్మను విశ్వసించు. ఆత్మపై నీవు ఆధారపడు. అంతేకానీ అన్యులపైన ఆధారపడకు. అన్నింటికిని దైవమే ఆధారము. ఈనాడు మనము సరైన సేవలలో పాల్గొనాలి. త్యాగములో ప్రవేశించాలి. అందుకోసమే వేదాంతము చెప్పింది, 'త్యాగము చేయని చేతికంటె కాయలు కాచిన కొమ్మ మేలు' అనింది. అనగా 'చెట్టే మేలు మానవుని కంటె'! 'చదువుకున్న మొద్దుకంటె, భూమిని దున్నే ఎద్దు మేల'న్నారు. అద్దైనా భూమిని దున్ని, పంటలు పండించి, దేశానికి ఉపకారము చేస్తుండాది. ఈ చదువుకున్న మొద్దుమనిషి ఏమి చేస్తున్నాడు? సంపాదనకు ప్రయత్నం చేస్తున్నాడు. కనుక, త్యాగము చేయని చేతులు కేవలము చెట్టుకొమ్మవంటివే! హృదయము కరగని మనిషి, కఠినమైన శిలా హృదయుడే!

మన హృదయాన్ని కరిగించాలి. మనసును కదిలించాలి. సేవలో ప్రవేశించాలి. ప్రేమతత్త్వాన్ని మనము పెంచుకోవాలి. ఇదే, పవిత్రమైన భక్తితత్త్వము. ఇదే ఆధ్యాత్మిక చిత్తము. ఇదే అనేకత్వములోని ఏకత్వము, దివ్యత్వములోని ఆత్మతత్త్వము. ఇదే మన పవిత్రత. ఈ పవిత్రతను మనము సాధించాలి. దేవునికొరకు ఎక్కడకోపోయి మనము శోధించనక్కరలేదు, నీ హృదయమునందే నీవు శోధించుకో!

**దేవుడనగ వేరు దేశమందున లేదు**
**దేవుడుండు తనదు దేహమందె**
**పాపమనగ వేరు పరదేశమున లేదు**
**తాను చేయు పనులయందె తగిలియుండు**

ప్రేమస్వరూపులారా! ఇలాంటి పవిత్రమైన భావములు చిత్తమందు అభివృద్ధి పరచుకొని యింక మున్ముందు సరైన సేవలు చేసి భారతదేశముయొక్క పవిత్రతను తిరిగి మీరు అభివృద్ధిపరచి యావత్ప్రపంచమునకు ఆదర్శమును అందించగలరని నేను ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ, నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను. ప్రేమను లక్ష్యములో పెట్టుకోండి. ప్రేమయే మిమ్ములను సర్వస్థానములకు చేరుస్తుంది. సర్వమును అనుభవింపచేస్తుంది.

**(తేదీ. 20-03-1988న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam